నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 14 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

నేడు, రేపు స్వాతంత్ర్య సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్

భువనగిరి అర్బన్, ఆగస్టు 13 : కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో స్వాతంత్ర్య సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ జి.కోటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫొటో ఎగ్జిబిషన్ బుధవారం ఉదయం 10గంటలకు ప్రారంభం కానుందని, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సమరయోధుల గురుంచి సవివరంగా ఫొటో ఎగ్జిబిషన్‌లో వివరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సర్కారు దవాఖానలకు సమస్యల సుస్తీ

గాడి తప్పిన ప్రజా వైద్యం | **జిల్లా దవాఖానల్లో మందుల్లేవ్**

- వేధిస్తున్న వైద్యుల కొరత.. వసతుల లేమి
- సమయ పాలన పాటించని వైద్య సిబ్బంది
- డాక్టర్ల కోసం గంటల తరబడి పేషెంట్ల ఎదురుచూపులు
- విష జ్వరాల సమయంలో తీవ్ర సమస్యలు

పేద, మధ్య తరగతి ప్రజల వైద్యానికి భరోసా ఇవ్వాల్సిన సర్కారు దవాఖానలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రైవేట్ దవాఖానలకు వెళ్లే స్థోమత లేక ప్రభుత్వ వైద్యం మీద నమ్మకంతో వస్తున్న రోగులకు అవస్థలు ఎదురవుతున్నాయి. నమస్తే తెలంగాణ బృందం మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రభుత్వ దవాఖానలను విజిట్ చేయగా అనేక సమస్యలు వెలుగుచూశాయి. వసతుల లేమి.. డాక్టర్ల కొరత.. అందుబాటులో లేని పరీక్షలు మందులు.. కొరవడిన పారిశుధ్యం.. పని చేయని వైద్య పరికరాలు.. సమయ పాలన పట్టని సిబ్బంది ఇలా అనేక సమస్యలను వివరిస్తూ రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.


యాదగిరిగుట్ట పీహెచ్‌సీలో ఉదయం 9.30 గంటలకు డాక్టర్ కోసం ఎదురుచూస్తున్న రోగులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 13 : గతంలో వంద పడకలతో ఉన్న భువనగిరి ఏరియా ఆసుపత్రి 225 పడకల స్థాయికి అప్‌గ్రేడ్ అయినా ఆ మేరకు సిబ్బందిని కేటాయించలేదు. 14 విభాగాల్లో 68 మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తుండగా, సిబ్బంది కొరత రోగులకు ఇబ్బందిగా మారింది. మరోవైపు తెలంగాణ డయాగ్నస్టిక్ డిస్ట్రిక్ హబ్‌లో రోగులకు అందాల్సిన పరీక్షల్లో జాప్యం జరుగుతున్నది. సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం వల్ల రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ కూడా అధ్వానంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా మారి చెడు వాసన వస్తున్నాయి. ఎస్‌కే అమాన్ అనే విద్యార్థి వైద్య పరీక్షల కోసం భువనగిరి జిల్లా ఆస్పత్రికి ఉదయం 7గంటలకు వచ్చానని, టైమ్ పది గంటలు సిబ్బంది డ్యూటీకి రాలేదని వాపోయాడు.

గుట్టలో సమయానికి రాని వైద్యులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది గంటలు దాటితే తప్ప రోగులకు వైద్యం అందడం లేదు. వైద్యులు సమయ పాలన పాటించకపోవడంతో ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధుల్లో ఉండే డాక్టర్లు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. 9 గంటలకు రావాల్సిన వైద్యాధికారి మంగళవారం 11 గంటలు దాటితే గానీ దవాఖానలో కనిపించ లేదు. స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర వైద్య సిబ్బంది కూడా సమయానికి రాలేదు. దాంతో రోగులు దవాఖానలో పడిగాపులు గాశారు. ఈ పీహెచ్‌సీని 24 గంటల వైద్య సేవలను బీఆర్ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే 24 గంటలు వైద్యం అందాల్సి ఉండగా, సాయంత్రం 4 గంటల వరకే సేవలు అందుతున్నట్లు రోగులు వాపోతున్నారు. యాదగిరిగుట్ట పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒకరే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ వైద్యాధికారిగా ఉన్న డాక్టర్ వంశీకృష్ణ ఆత్మకూరు(ఎం)కు బదిలీ కాగా, అక్కడ విధుల్లో ఉన్న డాక్టర్ విలియం కేరీ ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం ఆయన కూడా డిప్యూటేషన్ కింద భువనగిరి అర్బన్ దవాఖానకు వెళ్లడంతో ప్రస్తుతం డాక్టర్ పావని మాత్రమే విధుల్లో ఉన్నారు. కాగా, తాము రోజూ సమయ పాలన పాటిస్తున్నామని, శుక్రవారం వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయ్యి డ్యూటీకి రావడం ఆలస్యమైందని డాక్టర్ పావని తెలిపారు.

చౌటుప్పల్‌లో గర్భిణులకు తీవ్ర అవస్థలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్త, మూత్ర, ఘగర్ పరీక్షలు తప్పితే మిగతావి అందుబాటులో లేవు. ప్రధానంగా గర్భిణులకు కాన్పుకు ముందు అవసరమైన హెచ్‌సీవీ, ఎల్‌పీటీ, ఆర్ఎఫ్‌టీ, థైరాయిడ్ పరీక్షలు చేయడం లేదు. ఆ శాంపిల్స్‌ను సేకరించి భువనగిరి జిల్లా దవాఖానకు పంపిస్తే.. మరుసటి రోజు రిపోర్ట్స్ వస్తున్నాయి. దాంతో అదే రోజు డెలివరీకి వచ్చిన గర్భిణులు ప్రైవేటు ల్యాబ్‌కు వెళ్తున్నారు. గర్భిణులకు ఈసీజీ చేసేందుకు మహిళా సిబ్బంది లేరు. అనస్తీషియా డాక్టర్ ఒక్కరే ఉండగా, ఆయన సెలవు పెడితే ప్రసవం కోసం వచ్చిన గర్భిణులను భువనగిరి, హైదరాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానలకు రెఫర్ చేస్తున్నారు. సీహెచ్‌సీలో మధ్యాహ్నం తర్వాత పూర్తి స్థాయిలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. ఈసీజీ ఎక్స్‌రే ల్యాబ్‌లోనే రేడియేషన్‌తో భయపడుతున్నట్లు గర్భిణులు చెబుతున్నారు. ఈసీజీ తీసేందుకు ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రాధేయపడుతున్నారు.

భువనగిరి జిల్లా కేంద్ర దవాఖానలో ఖాళీగా కనిపిస్తున్న డ్యూటీ డాక్టర్ గది

యాదగిరిగుట్ట పీహెచ్‌సీలో మంగళవారం ఉదయం 9.27 గంటలకు ఖాళీగా వైద్యాధికారి కుర్చీ

తుంగతుర్తిలో డాక్టర్ల కొరత

తిరుమలగిరి(తుంగతుర్తి) : తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని 30 పడకల ప్రాథమిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గతంలో 100 పడకల ఏరియా దవాఖానగా మార్చారు. ప్రస్తుతం అందుకు అనుగుణంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది కేటాయింపు మాత్రం జరుగలేదు. ఇక్కడి డాక్టర్లు డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు డిప్యూటేషన్‌పై సబ్ సెంటర్లలో పని చేస్తున్నారు. తుంగతుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏడుగురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా, ముగ్గురు సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ మాత్రమే పని చేస్తున్నారు. నలుగురు డాక్టర్లు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ దవాఖానకు నిత్యం 200 నుంచి 300 మంది రోగులు వస్తుండగా, వైద్య పరీక్షలకు ఇబ్బందిగా మారింది.

కోదాడలో సగానికి పడ్డ ప్రసవాల సంఖ్య

కోదాడ : కోదాడ 30 పడకల దవాఖాన అరకొర వసతులతో నడుస్తున్నది. 200 నుంచి 300 మంది వరకు ఓపీ ఉంటున్నది. 16మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం సూపరింటెండెంట్‌తో కలిపి నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు జనరల్ సర్జన్లు, ఒక పిల్లల వైద్యుడితోపాటు కాంట్రాక్ట్ పద్ధతిలో గైనకాలజిస్ట్ విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఇద్దరు ప్రసూతి వైద్యులు ఉండాల్సి ఉండగా, ఒక్కరే ఉండడంతో ప్రసవాల సంఖ్య పడిపోయింది. గతంలో ఇక్కడ నెలకు 50కి పైగా ప్రసవాలు జరుగగా ఇప్పుడు 20లోపు మాత్రమే జరుగుతున్నాయి. డయాలసిస్ సెంటర్‌కు మినహా మిగతా విభాగాలకు జనరేటర్ సౌకర్యం లేదు.

హుజూర్‌నగర్‌లో ఓకే..

హుజూర్‌నగర్ : 100 పడకల సామర్థ్యం గల హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి జ్వరాలతో ఎక్కువమంది రాగా, వైద్యులు అందుబాటులో ఉన్నారు. దవాఖాన సిబ్బంది , మందుల కొరత లేదు. కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

నల్లగొండలో మందుల్లేవ్..

నల్లగొండ జిల్లా కేంద్ర జనరల్ ఆస్పత్రిలో గ్యాస్, కడుపునొప్పి, చర్మ వ్యాధులు వంటి సమస్యలకు కూడా మందులు ఉండడం లేదు. తొమ్మిది గంటలకు ప్రారంభం కావాల్సిన ఓపీ సేవలు పది గంటలు దాటితే గానీ ప్రారంభం అవట్లేదు. రోగులు గంటల తరబడి డాక్టర్ల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది. వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. పలువురు డాక్టర్లు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో కొత్తవారు పోవడంతో ఉన్నవారిపైనే పని ఒత్తిడి పెరుగుతున్నదని డాక్టర్లు వాపోతున్నారు. ఆరు విభాగాల్లో 77 మంది డాక్టర్లు, 42 మంది ఎస్ఆర్ ఉండాల్సిండగా కేవలం 33 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. నరాల వైద్య నిపుణులు, నెఫ్రాలజిస్ట్‌లు లేరు. ఉన్న డాక్టర్లు కూడా బయట ప్రైవేట్ క్లినిక్స్, లేదా సొంత ఆస్పత్రుల్లో పని చేసి ఆలస్యంగా రావడం వల్ల ఓపీ లేట్ అవుతుందని రోగులు చెప్తున్నారు.

నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో ఖాళీ కనిపిస్తున్న డాక్టర్ల కుర్చీలు

సూర్యాపేటలో ఒక్కో బెడ్‌పై ఇద్దరు పేషెంట్లు

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్ర దవాఖానకు రోజూ దాదాపు వెయ్యి మంది వరకు వివిధ జబ్బులు, విష జ్వరాలతో వస్తున్నా అందుతున్న సేవలు మాత్రం అంతంతమాత్రమే. 80 బెడ్స్ ఉన్న జనరల్ వార్డులో దాదాపు 110 మంది రోగులను ఉంచారు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు చొప్పున ఉంచి వైద్యం చేస్తున్నారు. ఓపీ సేవలు మధ్యాహ్నం వరకే అందుతున్నాయి. మధ్యాహ్నం తర్వాత వైద్యులు ప్రైవేటు ఆస్పత్రిలో విధులకు వెళ్తుంటే ఇక్కడికి వచ్చే రోగులకు మాత్రం వైద్య విద్యార్థులే దిక్కవుతున్నారు. గతం పోలిస్తే ఓపీ సగానికి పడిపోయింది. ఇద్దరు మాత్రమే ఓపీ చీటీలు ఇస్తుండడంతో గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తున్నది. డాక్టర్లు రాసిన మందులు పూర్తిగా ఆసుపత్రిలోని మెడికల్ షాపులో ఉండకపోవడంతో బయట తీసుకోవాల్సి వస్తున్నది. ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది.

సూర్యాపేట జిల్లా కేంద్ర దవాఖానలో ఒక్కో బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స

నకిరేకల్‌లో చాలని బెడ్లు

కట్టంగూర్ : సీజనల్ వ్యాధుల కారణంగా నకిరేకల్ ప్రభుత్వాసుపత్రిలో రోజూ 300 నుంచి 400 ఓపీ నమోదవుతుండగా, ప్రస్తుతం 30 పడకలు మాత్రమే ఉన్నాయి. బెడ్స్ సరిపోకపోవడంతో గైనకాలజీ వార్డులోని 5 బెడ్స్‌ను వాడుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 30 పడకలను 100 పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. రూ.32 కోట్లతో చేపడుతున్న పనులు 80 శాతం పూరయ్యాయి.

నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ కోసం బారులుతీరిన రోగులు

హాలియాలో 24 గంటల సేవల్లేవ్..

హాలియా పీహెచ్‌సీలో 24 గంటల వైద్యం అందాల్సి ఉన్నా, వైద్యుల కొరత కారణంగా అది సాధ్యమవడం లేదు. ఒక్క డాక్టరే ఉండడంతో ఆయన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీటి సౌకర్యం లేదు. నిత్యం వంద వరకు ఓపీ నమోదవుతున్నా 8 ఏఎన్ఎం, స్టాఫ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నైట్‌డ్యూటీ స్టాఫ్‌నర్సు లేరు. మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఆస్పత్రిలో గ్యాస్ ట్రబుల్, షుగర్, బీపీ నొప్పుల గోలీలు అందుబాటులో లేవు.

దేవరకొండలో పని చేయని ఎక్స్‌రే మెషీన్

చందంపేట(దేవరకొండ) : దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లు సమయానికి రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం10 తర్వాత నుంచి 11 గంటల వరకు ఒక్కొక్కరుగా విధులకు హాజరయ్యారు. స్కిన్ డాక్టర్ ఆలస్యంగా రావడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఆస్పత్రిలోని ఎక్స్‌రే మెషీన్ వారం నుంచి పని చేయకపోవడంతో రోగులు బయటకు వెళ్లి ఎక్స్‌రే తీయించుకుంటున్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో దోమల బెడద అధికంగా ఉంది.

పీఏపల్లిలో ఒక్కరే డాక్టర్

పీఏపల్లి పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలు అందాల్సి ఉండగా, సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో సాయంత్రం ఐదు దాటితే బంద్ పెడుతున్నారు. గతంలో ఇక్కడున్న ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సుల్లో స్టాఫ్ నర్సులు బదిలీపై వెళ్లగా, ఒక డాక్టర్ డిప్యూటేషన్ మరొక చోటకు వెళ్లారు. ప్రస్తుతం ఒక స్టాఫ్ నర్సు, ఒక డాక్టరు మాత్రం విధుల్లో ఉన్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్ర దవాఖానలో ఓపీ చీటీలు ఇచ్చే కౌంటర్లు రెండే ఉండడంతో క్యూలో రోగుల నిరీక్షణ

యాదగిరిగుట్టలో నేటి నుంచి పవిత్రోత్సవాలు

- సాయంత్రం 6 గంటలకు స్వస్తీవాచనంలో ఉత్సవాలకు అంకురార్పణ

యాదగిరిగుట్ట, ఆగస్టు 13: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ప్రధానాలయంతోపాటు అనుబంధ ఆలయమైన పుర్వగిరి(పాతగుట్ట) ఆలయంలో పవిత్రోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరుగనున్నది. సాయంత్రం 6 గంటలకు స్వస్తీవాచనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అంకురారోపణంతో ఉత్సవాలను ప్రధానార్చకుల బృందం ప్రారంభించనున్నది. మొదటి రోజు కంకణధారణ పూజ, మృత్స్యంగ్రహణం, పాలికాది హోమం నిర్వహించనున్నారు. పవిత్రమైన శ్రావణ మాసంలో స్వామివారికి పవిత్రోత్సవం అనే వైదృశ్య కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు తెలిపారు. చతుస్థానార్చన పూర్వకంగా స్వామివారిని బింభం, కుంభం, కుండం, మండలం యందు ఆవాహనం చేసి, ఆరాధిస్తూ ప్రత్యేకమైన అభిషేకాలను చేయనున్నట్లు పేర్కొన్నారు. మహా నివేదనలు సమర్పించి పవిత్రమాలలను ధరింపజేయనున్నట్లు చెప్పారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకారంలోని అద్దాల మండపానికి ఎదురుగా రెండ్రోజులపాటు ఉత్సవాలు జరుగనున్నాయి. అందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. విమానగోపురంపై మహా సుదర్శన చక్రానికి పవిత్రమాలలు ధరింపజేసేందుకు తాత్కాలిక పరంజాలను ఏర్పాటు చేశారు. పవిత్రోత్సవాల సందర్భంగా 15, 16 తేదీల్లో భక్తుల ద్వారా జరిపే నిత్య, శాశ్వత తిరుకల్యాణం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం రద్దు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు.

యాదగిరిగుట్ట ప్రధానాలయం విమాన గోపురం వద్ద ఏర్పాటుచేసిన పరంజా

గురుకులాల్లో సౌకర్యాలు కల్పించండి

- ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీలత
- భువనగిరి బీసీ గురుకులం సందర్శన.. వసతుల లేమిపై అసంతృప్తి


బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించిన ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీలత

భువనగిరి అర్బన్, ఆగస్టు 13 : గురుకుల పాఠశాలల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవీలత అన్నారు. పట్టణంలోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావుతో కలిసి మంగళవారం ఆమె సందర్శించారు. పాఠశాల భవనం పాతది అవడంతో వానలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. భోజనంలో నాణ్యత లోపించిందని, పరిశుభ్రత పాటించడం లేదని చురకలు అంటించారు. జిల్లావ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతుల కోసం విద్యాశాఖ, సంక్షేమ శాఖ, జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బాల, బాలికలకు న్యాయ సేవలు అందించడానికి బాలల చట్టపరమైన హక్కుల సాధికారతకు జాతీయ న్యాయ సేవా సంస్థ పథకం రూపొందించబడిందని, అందులో భాగంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆయా పాఠశాలలను సందర్శించి అవసరమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

ధర్మకర్తల మండళ్లకు దరఖాస్తులు

రామగిరి, ఆగస్టు 13 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో గల పలు దేవాలయాలకు నూతన ధర్మకర్తల మండళ్ల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నెపర్తి సులోచన తెలిపారు. ఆసక్తి గల వారు 20 రోజుల్లోగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ నల్లగొండ, హైదరాబాద్ కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఆయా దేవాలయాల ఈఓ, జిల్లా దేవాదాశాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో తెలుసుకోవచ్చని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

దరఖాస్తులు చేసుకోవాల్సిన ఆలయాలు..

- భక్తాంజనేయస్వామి దేవస్థానం తులసీనగర్, నల్లగొండ
- సీతారామచంద్రస్వామి దేవస్థానం, అన్నెపర్తి, నల్లగొండ మండలం
- భక్తాంజనేయ సహిత సంతోషిమాత దేవస్థానం. షేర్‌బంగ్లా, నల్లగొండ
- రేణుకాఎల్లమ్మ దేవస్థానం, శ్రీనగర్‌కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ
- వేంకటేశ్వరస్వామి దేవస్థానం, మారేపల్లి
- వారిజాల గోపాలస్వామి దేవస్థానం, గోపాలయపల్లి, నార్కట్‌పల్లి మండలం
- వేణుగోపాల స్వామి దేవస్థానం, మాడ్గులపల్లి
- లక్ష్మీనరసింహ్మస్వామి దేవస్థానం, మాదనపురం, చింతపల్లి మండలం
- సీతారామచంద్రస్వామి దేవస్థానం, బండపాలెం, కేతేపల్లి మండలం
- కోదండ రామచంద్రస్వామి దేవస్థానం, కురుమర్తి, కట్టంగూర్ మండలం
- ఛాయాసోమేశ్వరస్వామి దేవస్థానం, పానగల్, నల్లగొండ మండలం
- అర్వపల్లి యోగానంద లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం
- సూర్యాపేట వేంకటేశ్వర స్వామి దేవాలయం

పండ్రాగస్టు ఏర్పాట్ల పరిశీలన

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి అర్బన్, ఆగస్టు 13 : ఈ నెల 15న పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ హనుమంతు కె.జెండగే మంగళవారం పరిశీలించారు. వేడుకలకు హాజరు కానున్న ప్రముఖులు, ప్రదర్శనలు నిర్వహించే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

నల్లబ్యాడ్జీలతో మోడల్ స్కూల్ టీచర్ల నిరసన


వలిగొండ : లోతుకుంట మోడల్ స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బొమ్మలరామారం/వలిగొండ, ఆగస్టు 8 : సమస్యల పరిష్కారం కోసం మోడల్ స్కూల్ టీచర్లు ఆందోళనకు దిగారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు పాఠశాలల్లో మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బొమ్మలరామారం స్కూల్ వద్ద తెలిపిన నిరసనలో టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిలువేరు మహేశ్ మాట్లాడుతూ మోడల్ పాఠశాల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేపట్టారు. కారుణ్య నియామకాలకు అవకాశం ఇవ్వాలని, సోషనల్ సర్వీస్ ఇవ్వాలని కోరారు. వలిగొండ మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ వద్ద ఉపాధ్యాయులు ప్లకార్డులు, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఇంటర్మీడియట్ తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులను జూనియర్ లెక్చరర్లుగా పరిగణించాలని, హెల్త్‌కారులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ జి.రాము, ఉపాధ్యాయులు రమేశ్, కనకదుర్గ, పూర్ణిమ, పృథ్వీరాజ్, వెంకటేశం, ప్రవీణ్, అనసూయ, జంతిలాల్, రవీందర్‌రెడ్డి, మంజుల, సుస్మిత, మహేందర్, నవీన్, నగేశ్, కేదార్‌నాథ్, శ్రీనయ్య, వినోదరాణి, అన్నపూర్ణ, సింధూర పాల్గొన్నారు.